సాక్షి జగిత్యాల

బుధవారం ◆ 1 ◆ మే ◆ 2024



కొండగట్టులో భక్తుల రద్దీ

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న ఆలయం మంగళవారం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఉదయమే భక్తులు దర్శనాలు పూర్తి చేసుకున్నారు.



బద్దిపోచమ్మకు బోనం

వేములవాడ: రాజన్నను దర్శించుకున్న భక్తులు మంగళవారం బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. ఎండను సైతం లెక్కచేయకుండా భక్తులు తరలివచ్చారు.

గరిష్టం/కనిష్టం
45.0/30.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉదయం నుంచే ఎండవేడిమి కొనసాగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోత పెరుగుతుంది. వడగాల్పులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

విద్యుత్ వినియోగం పెరుగుతోంది



సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్‌ఈ

జగిత్యాలఅగ్రికల్చర్: ఎండలు మండుతున్న నేపథ్యంలో విద్యుత్ లోడ్ పెరుగుతోందని, సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ సత్యనారాయణ అన్నారు. జగిత్యాలలోని 33/11 కేవీ, మల్యాల సబ్‌స్టేషన్‌ను మంగళవారం విద్యుత్ అధికారులతో కలిసి పరిశీలించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం రాకుండా సిబ్బంది ఎప్పటికప్పుడు విద్యుత్ లైన్లను పరిశీలించాలని సూచించారు. సబ్ స్టేషన్లలోని లాగ్ బుక్, బ్రేకర్‌లోని రిలేల అంతరాయంపై సబ్ స్టేషన్ల అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏయే సమయాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడుతోందనే వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏడీఈ టెక్నికల్ నగేష్‌కుమార్, ఏఈ గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠుపై అప్రమత్తంగా ఉండాలి



పరీక్షలు చేస్తున్న వైద్యులు

జగిత్యాలరూరల్: కుష్ఠువ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. మంగళవారం టీఆర్‌నగర్ బస్తీ దవాఖానాలో కుష్ఠువ్యాధి పరీక్షలు నిర్వహించారు. కుష్ఠు లక్షణాలున్నవారు నిర్లక్ష్యం చేయకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధిపై అవగాహన కల్పించారు. మెడికల్ ఆఫీసర్ రవిశంకర్, ఈవో జగదీశ్, ల్యాబ్ టెక్నీషియన్ బెనర్జీ పాల్గొన్నారు.

95.76 శాతం ఉత్తీర్ణత



- మెరుగుపడిన 'పది' ఫలితాలు
- 24 నుంచి 11వ స్థానానికి ఎగబాకిన జిల్లా
- ఎప్పటిలాగే బాలికలే ముందంజ

జగిత్యాల: పదో తరగతి ఫలితాల్లో జిల్లా మెరుగుపడింది. 95.76శాతంతో రాష్ట్రంలో 11వ స్థానానికి ఎగబాకింది. ఫలితాల్లో ఎప్పుడూ అగ్రస్థానంలో ఉండే జిల్లా క్రమంగా పడిపోయింది. జిల్లా ఆవిర్భావం నుంచి 2016, 2017, 2018, 2019లో వరుసగా రాష్ట్రంలోనే మొదటిస్థానంలో నిలిచి హ్యాట్రిక్ సాధించిన జిల్లా.. కరోనా మహమ్మారి ప్రబలినప్పటి నుంచి ర్యాంకును పోగొట్టుకుంటూ వచ్చింది. గతేడాది ఏకంగా రాష్ట్రంలో 24వ స్థానానికి పడిపోయింది. తాజాగా ప్రకటించిన ఫలితాల్లో 23స్థానాలు ఎగబాకి 11వ స్థానానికి చేరింది.

ప్రత్యేక క్లాసులు

ఈ విద్యాసంవత్సరం ప్రారంభం నుంచే విద్యాశాఖ అధికారులు పదో తరగతి విద్యార్థులపై శ్రద్ధ పెట్టారు. కలెక్టర్, డీఈవో ఆదేశాల మేరకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు స్పెషల్ క్లాసులు తీసుకున్నారు. వందశాతం ఉత్తీర్ణత సాధించాలని పట్టుదలతో ముందుకెళ్లారు. అయినా 11వ స్థానంతోనే సంతృప్తి పడాల్సి వచ్చింది.

ఫలితాలు ఇలా..

జిల్లాలో మొత్తం 11,380 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. వీరిలో 5,668 మంది బాలురు, 5,712మంది బాలికలు. వీరిలో 10,898 విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇందులో 5,379 బాలురు, 5,519 మంది బాలికలున్నారు. మొత్తంగా 95.76శాతం ఉత్తీర్ణత సాధించగా.. బాలురు 94.90శాతం, బాలికలు 96.62శాతంతో ఉత్తీర్ణత సాధించారు. ఈ లెక్కన ఎప్పటిలాగే బాలికలే పైచేయి సాధించినట్లయ్యింది.

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఎన్నికల పరిశీలకురాలు అలిస్‌వాజ్ ఆర్
- కోరుట్ల, జగిత్యాలలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, పోలింగ్ బూత్‌ల పరిశీలన



కోరుట్లలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రంను పరిశీలిస్తున్న అబ్జర్వర్

కోరుట్ల: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని నిజామాబాద్ పార్లమెంట్ సాధారణ ఎన్నికల పరిశీలకురాలు అలిస్‌వాజ్ అర్ అధికారులకు సూచించారు. కోరుట్లలోని ఎస్ఎఫ్ఎస్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఆర్డీవో ఆనంద్ కుమార్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం తగిన ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ఈవీఎంలు భద్రపరిచే స్ట్రాంగ్ రూంను పరిశీలించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలికల కళాశాల, పైడిమడుగులో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. జగిత్యాల మండలంలోని చల్‌గల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలు, జిల్లాకేంద్రంలోని మినీ స్టేడియంలోని రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని జగిత్యాల ఆర్డీవో మధుసూదన్‌తో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. తహసీల్దార్లు కిషన్, రాంమోహన్, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

నేడు కోరుట్లలో సీఎం సభ

- 50 వేల మంది జన సమీకరణకు ఏర్పాట్లు
- విజయవంతం చేయండి: జీవన్‌రెడ్డి, జువ్వాడి



కోరుట్ల: ఎన్నికల ప్రచారంలో భాగంగా నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డికి మద్దతుగా బుధవారం కోరుట్లలో సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ మేరకు కోరుట్లలోని వెటర్నరీ కళాశాల ముందున్న మైదానంలో ఏర్పాట్లు చేశారు. ఎండలను దృష్టిలో ఉంచుకుని ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటలలోపు సభ పూర్తయ్యేలా చూస్తున్నారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని జగిత్యాల, కోరుట్ల, ఆర్మూర్, బోధన్, నిజామాబాద్, నిజామాబాద్ రూరల్, బాల్కొండ నియోజకవర్గాల నుంచి సుమారు 50వేల మందివరకు ప్రజలు రానున్నారని ఎమ్మెల్సీ, పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కోరుట్ల ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు తెలిపారు. సభను విజయవంతం చేయాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ కోరారు. నాయకులు అరికెల నర్సారెడ్డి, జువ్వాడి కృష్ణారావు, సుజిత్‌రావు, జేఎస్.వెంకట్, కొమొరెడ్డి కరం, ఆకుల లింగారెడ్డి పాల్గొన్నారు.

వాహనాల దారి మళ్లింపు

కోరుట్ల వెటర్నరీ కళాశాల ఎదురుగా ఉన్న మైదానంలో బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభ ఉన్నందున వాహనాలకు ఇబ్బంది కలగకుండా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు దారి మళ్లిస్తున్నట్లు మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు తెలిపారు. మెట్‌పల్లి మీదుగా జగిత్యాల వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు మెట్‌పల్లి డిపో, వేంపేట, చిట్టాపూర్, ధర్మారం, అయిలాపూర్, కల్లూర్, పెద్దాపూర్, కోరుట్ల సాయిబాబాటెంపుల్ మీదుగా.. కోరుట్ల నుంచి మెట్‌పల్లి వైపు వచ్చే వాహనాలు కోరుట్ల సాయిబాబాటెంపుల్ నుంచి ఆర్టీసీ బస్ డిపో వరకు చేరేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రజలు, వాహనదారులు పోలీసులు సూచించిన మార్గంలో పయనించి సహకరించాలని కోరారు.

ఎండలపై జాగ్రత్తగా ఉండాలి



వెల్లులలో చలివేంద్రాన్ని పరిశీలిస్తున్న దివాకర

మెట్‌పల్లిరూరల్: రోజురోజుకూ పెరుగుతున్న ఎండలపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అడిషనల్ కలెక్టర్ దివాకర అన్నారు. మెట్‌పల్లి మండలం వెల్లుల, చౌలమద్ది, చింతలపేట, పెద్దాపూర్‌లో ఆయన పర్యటించారు. అత్యవసరమై తే తప్ప ప్రజలు బయటకు రావొద్దన్నా రు. ఉదయం 11 గంటల నుంచి మ.ధ్యాహ్నం మూడు గంటల వరకు ఇంట్లోనే ఉండేలా మైక్‌ల ద్వారా తెలియజేయాలని అధికారులకు సూచించారు. పెద్దాపూర్‌లోని రెసిడెన్షియల్ స్కూ ల్ ను సందర్శించి పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాల్లోని నర్సరీలు, రహదారులు, డ్రైనేజీలను పరిశీలించి 100 శాతం మొక్కలు బతికేలా చూడాలన్నారు. చలివేంద్రాల్లో నీరు ఎప్పటికప్పుడు పోయించాలని సూచించారు.

'గ్రూప్-1' పకడ్బందీగా నిర్వహించాలి



వీడియోకాన్ఫరెన్స్‌లో అడిషనల్ కలెక్టర్ దివాకర

జగిత్యాల: గ్రూప్-1 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యదర్శి నికోలస్ అన్నారు. మంగళవారం పోలీస్, నోడల్ అధికారులతో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జూన్ 9న జరిగే పరీక్షకు కేంద్రాలను గుర్తించామన్నారు. సీటింగ్, మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా, సీసీ కెమెరాలపై నివేదికలు పంపించాలన్నారు. అదనపు కలెక్టర్ దివాకర మాట్లాడుతూ జిల్లాలో 31 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. జగిత్యాలలో 26, కోరుట్లలో 4, కొండగట్టు జేఎన్‌టీయూలో ఒకటి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆర్డీవోలు మధుసూదన్, ఆనంద్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

లక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణం

మల్లాపూర్: మండలలంలోని గొర్రెపల్లి శ్రీ లక్ష్మీవెంకటేశ్వర ఆలయంలో మంగళవారం శ్రీ లక్ష్మీ-వేంకటేశ్వర స్వామి కల్యాణం, జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాలచందర్, ఏఎంసీ మాజీ చైర్మన్ కదుర్క నర్సయ్య, మాజీ సర్పంచ్‌లు కొంపెల్లి సరోజ, కదుర్క రాధ, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రూ.3.60 లక్షలు పట్టివేత

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని అంగడి బజార్‌లో పట్టణ ఎస్సై నరేశ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా అరవింద్‌నగర్‌కు చెందిన చెట్‌పల్లి రమేశ్ ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.లక్ష తీసుకెళ్తుండగా సీజ్ చేశారు. పట్టణ ఎస్సై మన్మథరావు ఆధ్వర్యంలో పాతబస్టాండ్‌లో వాహనాల తనిఖీ చేపట్టగా బుగ్గారం మండలం వెల్గొండ గ్రామానికి చెందిన జెల్ల సురేశ్ రూ.1.60 లక్షలు తీసుకెళ్తుండగా పట్టుకుని సీజ్ చేశారు. తహసీల్ చౌరస్తాలో జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం గ్రామానికి చెందిన గుండు శంకర్ రూ.లక్ష తీసుకెళ్తుండగా ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసి నగదును డిస్ట్రిక్ట్ గ్రీవెన్‌సెల్‌కు అప్పగించారు.

బైక్ ఢీకొని వృద్ధుడి దుర్మరణం


తాళ్ల శంకర్

మల్లాపూర్: మండలంలోని కొత్తదాంరాజుపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తాళ్ల శంకర్ (60) మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన శంకర్ టేల పెట్టుకుని జీవిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం శంకర్ ద్విచక్రవాహనంపై నీరు తీసుకొస్తుండగా.. నిర్మల్ జిల్లా సుర్జాపూర్‌కి చెందిన ఇద్దరు యువకులు బైక్‌పై వేగంగా వచ్చి శంకర్‌ను ఢీకొట్టారు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు మెట్‌పల్లి ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు ఘటనస్థలికి వెళ్లి విచారణ చేపట్టారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి


సత్యనారయణ (ఫైల్)

సారంగాపూర్(జగిత్యాల): మండలంలోని కోనాపూర్‌కు చెందిన తిరుకోవెల సత్యనారాయణ(52) అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడు గుండెపోటుతో మృతిచెందారు. బాధిత కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. సత్యనారాయణ అర్పపల్లి ఉన్నత పాఠశాలలో పని చేస్తున్నారు. రెండు రోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు గురవడంతో కుటుంబసభ్యులు జగిత్యాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందాక ఇంటికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి బాత్రూంలోకి వెళ్లి, అక్కడే కుప్పకూలిపోయారు. కుటుంబసభ్యులు బయటకు తీసుకువచ్చిన కాసేపటికే చనిపోయారు. మృతుడికి భార్య స్వర్ణలత, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మంగళవారం నిర్వహించిన ఆయన అంత్యక్రియల్లో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటలో మంగళవారం బైక్‌ను వ్యాన్ ఢీకొట్టిన సంఘటనలో ఒకరికి తీవ్రగాయాలైనట్లు పోలీసులు తెలిపారు. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పెల్లి మండలం హినాయత్‌నగర్ గ్రామానికి చెందిన గైని అరవింద్ బైక్‌పై కథలాపూర్ మండలకేంద్రానికి వస్తున్నారు. భూషణరావుపేటలో ఎదురుగా వస్తున్న వ్యాన్ ఢీకొట్టింది. ప్రమాదంలో అరవింద్‌కు తీవ్రగాయాలు కావడంతో కోరుట్లలోని ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడి తండ్రి లింగం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ పేర్కొన్నారు.

ఈడీ, మనీ లాండరింగ్ పేరిట మోసం

- విశ్రాంత ఇంజినీర్‌ను బురిడీ కొట్టించిన సైబర్ నేరగాళ్లు
- ఏకంగా రూ.4.20 కోట్లు దోచుకున్న వైనం
- పది రోజుల్లో 200 అకౌంట్లలోకి ట్రాన్స్‌ఫర్
- ఇప్పటికే ఆరుగురిని అరెస్టు చేసిన పోలీసులు
- అసలు నిందితుల ఆచూకీ కోసం గాలింపు



కోరుట్ల: వేలు కాదు.. లక్షలు కాదు.. ఏకంగా రూ.4.20కోట్లు.. అది కూడా ఓ విశ్రాంత ఇంజినీర్ అకౌంట్ నుంచి సైబర్ చీటింగ్ ఎలా జరిగిందన్న అంశం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. సదరు విశ్రాంత ఇంజినీర్ అకౌంట్‌లో అంత పెద్ద మొత్తం డబ్బు ఉందని సైబర్ ముఠాకు ఎలా తెలిసింది..? ఆయన అకౌంట్ నుంచి డబ్బును దోచుకున్న ముఠా పదిరోజుల వ్యవధిలోనే ఇతర ఖాతాల్లోకి మార్పిడి చేసి ఎలా కాజేశారు..? దీని వెనక అసలు నిందితులు ఎవరు..? అనేవి అంతు లేని ప్రశ్నలుగా మిగులుతున్నాయి.

ఈడీ పేరిట ఉచ్చు..

కోరుట్లకు చెందిన బాసెట్టి శంకరయ్య విశ్రాంత ఇంజినీర్. ఆయన ప్రస్తుతం తిరుపతిలో ఉంటున్నారు. గతేడాది నవంబర్ ఒకటిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)లో పనిచేస్తున్నామని, ముంబయిలో జరిగిన ఓ మనీలాండరింగ్ కేసులో శంకరయ్య ప్రమేయం ఉందని, అకౌంట్లు తనిఖీ చేయాలని సారిక అనే అమ్మాయి నెట్ నుంచి ఫోన్ చేసింది. ముంబయి కోర్టులో విచారించాల్సి ఉందని రెండు నకిలీ లేఖలు సృష్టించి శంకరయ్యకు ఆన్‌లైన్‌లో పంపించారు. కంగారుపడిన శంకరయ్య ఏం చేయాలో తోచక వారినే సలహా అడిగారు. కేసు నుంచి తప్పిస్తామని నమ్మించిన సైబర్ నేరగాళ్లు ఆయన అకౌంట్‌లో ఉన్న డబ్బులు ఎలా ట్రాన్స్‌ఫర్ అయ్యాయో వివరాలు పరిశీలించి తిరిగి పంపిస్తామని, ముందుగా తాము చెప్పిన అకౌంట్లకు డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయాలని నమ్మించారు.

పది రోజుల్లో మార్పిడి..

ఈడీ కేసు, నకిలీ నోటీసులతో బెదిరిపోయిన శంకరయ్య సైబర్ నేరగాళ్లు చెప్పినట్లు తన ఖాతాల్లోని డబ్బులను వారు సూచించిన అకౌంట్లలోకి ఆన్‌లైన్‌లో ప్రతిరోజూ కొన్ని డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేశాడు. తరువాత సైబర్ నేరగాళ్లు ఎనీడెస్క్ టెక్నాలజీతో శంకరయ్య ల్యాప్‌టాప్ నుంచి నేరుగా తమ ఖాతాల్లోకి డబ్బులు మార్పిడి చేసుకున్నారు. పది రోజుల్లోనే అంటే నవంబర్ 14 వరకు రూ.4.20 కోట్లు తమ అకౌంట్లలోకి పంపించుకున్నారు. సైబర్ నేరగాళ్లు మళ్లీ శంకరయ్యకు ఫోన్ చేసి 20ఏళ్ల క్రితం షేర్ మార్కెట్‌లో సంపాదించిన డబ్బుల వివరాలు కావాలని అడగగా అనుమానించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. తాను మోసపోయినట్లు గుర్తించి నవంబర్ 27న కోరుట్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. స్పందించిన జగిత్యాల సైబర్ పోలీసులు సైబర్ నేరగాళ్ల ఖాతాలు ఫ్రీజ్ చేయించారు.

200 అకౌంట్లలోకి..

సైబర్ నేరగాళ్లు శంకరయ్య డబ్బులను సుమారు 200 అకౌంట్లలోకి ట్రాన్స్‌ఫర్ చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. కేరళ, రాజస్థాన్‌లోని కొందరి అకౌంట్లకు డబ్బులు మార్పిడి అయినట్లు తెలిసింది. నగదు మార్పిడిలో సమస్యలు ఉన్నాయని, అకౌంట్లలో డబ్బులు వేస్తామని, వాటిని తిరిగి ఇవ్వాలని, దీనికి సహకరిస్తే రూ.50వేల నుంచి రూ.లక్ష ఇస్తామని ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం. అలా సైబర్ నేరగాళ్లు వేర్వేరు వ్యక్తుల ఖాతాల్లోకి పంపి వాటిని తిరిగి తమ ఖాతాల్లోకి మార్చుకున్నారు.

అసలు నిందితులు దుబాయ్‌లో..

కేసుపై దృష్టి సారించిన పోలీసులు విచారణను వేగవంతం చేశారు. ఈ కేసులో ఇప్పటికే ఆరుగురు నిందితులను పట్టుకున్నారు. కేరళలో పట్టుబడిన నిందితుల అకౌంట్లను సైబర్ నేరగాళ్లు వాడుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ నేరంలో డబ్బులు మారిన ఇతర అకౌంట్ల వ్యక్తులు కేరళ, రాజస్థాన్‌లో ఉన్నట్లు గుర్తించి వారి ఆచూకీపై దృష్టి పెట్టారు. ఈ సైబర్ క్రైంలో కీలక నిందితులు దుబాయ్‌లో ఉన్నట్లు అనుమానిస్తున్నారు. వారు చిక్కితేనే శంకరయ్య ఖాతాలో రూ.కోట్లల్లో డబ్బులు ఉన్న సమాచారం సైబర్ నేరగాళ్లకు ఎలా తెలిసిందన్న విషయంలో స్పష్టత రానుంది.

జాగ్రత్తలు తప్పనిసరి..

- సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను జగిత్యాల సైబర్ క్రైం డీఎస్పీ రంగారెడ్డి సూచించారు. ఆన్‌లైన్ లో మోసపోయినట్లు ఏ మాత్రం అనుమానం వచ్చినా ఆలస్యం చేయకుండా వెంటనే సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.
- కస్టమర్ కేర్ పేరిట ఫోన్ మెసేజ్‌లు, ఫ్యాన్సీ సెల్‌నంబర్ల పేరిట వచ్చే మెసేజ్‌లు నమ్మొద్దు..
- జాబ్, లోన్లు, లాటరీలు, గిఫ్టులు, క్రెడిట్, డెబిట్ కార్డుల, ఇంటర్నెట్ బ్యాంకింగ్ పేరిట వచ్చే మెసేజ్‌లను ఓపెన్ చేయొద్దు.
- ఆన్‌లైన్ బిజినెస్ పెట్టుబడి, డేటింగ్ యాప్స్, యూపీఐ ఫోన్‌పే, గూగుల్‌పే మోసాలు, నకిలీ ఉత్పత్తుల వైపు వెళ్లొద్దు.
- ఐటీ, సీఐడీ, ఈడీ పేరిట తప్పుడు కాల్స్, ఫేక్ ఈ మెయిల్స్, ఎస్ఎంఎస్‌లు, గుర్తు తెలియని వ్యక్తుల వీడియో, నెట్ కాల్స్‌కు స్పందించొద్దు.

బీఆర్‌ఎస్‌తోనే గల్లీ సమస్యలు ఢిల్లీకి..


ప్రచారం చేస్తున్న బాజిరెడ్డి గోవర్ధన్, చిత్రంలో ఎమ్మెల్సీ రమణ, ఎమ్మెల్యే సంజయ్, జెడ్పీ చైర్‌పర్సన్

జగిత్యాల: గల్లీ సమస్యలు ఢిల్లీలో వినబడాలంటే బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మంచినీళ్ల బావి, చల్‌గల్‌లో కార్నర్‌మీటింగ్‌లో మాట్లాడారు. బీజేపీ, కాంగ్రెస్ మోసపూరిత హామీలకు మోసపోవద్దన్నారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ దేశంలోనే నంబర్‌వన్ స్థానం సాధించిందన్నారు. నకిలీ సెక్యూలర్ జీవన్‌రెడ్డి, నకిలీ మతవాది అర్వింద్ అని ఆరోపించారు. బాండ్‌పేపర్ రాసిస్తూ ప్రజలను మోసం చేస్తారన్నారు. అనంతరం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మోదీని చూపించి అర్వింద్ ఓట్లు అడుగుతున్నారని, ఆయనకు ఒంటరిగా గెలిచే సత్తాలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరుగ్యారంటీలంటూ ఒక్కటీ అమలు చేయడం లేదన్నారు. జీవన్‌రెడ్డి చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ రమణ, జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత, మాజీమంత్రి రాజేశంగౌడ్, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి పాల్గొన్నారు.

అల్లీపూర్‌లో ఇంటింటి ప్రచారం

రాయికల్(జగిత్యాలరూరల్): బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ రమణ, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత కోరారు. మంగళవారం రాయికల్ మండలం అల్లీపూర్, భూపతిపూర్‌లో ప్రచారం చేశారు. కాంగ్రెస్, బీజేపీ మోసపూరిత మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు. ఎంపీపీ సంధ్యారాణి, మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి, వైస్ ఎంపీపీ మహేశ్వర్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

బాజిరెడ్డి గెలుపునకు కృషి చేయాలి

ఇబ్రహీంపట్నం: బాజిరెడ్డి గెలుపునకు కార్యకర్తలందరూ కృషి చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. మండలంలోని అమ్మక్కపేట, ఎర్రాపూర్, డబ్బా గ్రామాల్లో ముఖ్యకార్యకర్తలతో సమావేశంలో మాట్లాడారు. ఎంపీ అర్వింద్ చేసిందేమీ లేదని, పసుపుబోర్డు హామీ కూడా నెరవేరలేదని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే బాజిరెడ్డిని గెలిపిస్తే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందన్నారు. వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎలాల దశరథ్‌రెడ్డి, మండల కో–ఆప్షన్ ఎలేటి చిన్నారెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ అల్లూరి రఘుపతిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బోదకాలు బాధితుడి వైద్యానికి రూ.1.40 లక్షలు సాయం


దాతల విరాళాలను పంపిణీ చేస్తున్న మేనేజర్

ధర్మపురి: బోదకాలు సమస్యతో ఇబ్బంది పడుతూ ఇంటికే పరిమితమైన ఓ బాధితుడి వైద్య ఖర్చులకు ఫేస్‌బుక్ పోస్టుకు స్పందించిన ఎన్నారైలు రూ.1.40లక్షలు సాయం అందించి ఔదార్యాన్ని చాటుకున్నారు. మండలంలోని బుద్దేశ్‌పల్లెకు చెందిన జాడి మనోహర్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకున్నాడు. కొంతకాలంగా బోదకాలు సమస్యతో ఇబ్బంది పడుతూ ఇంటివద్దే ఉంటున్నాడు. వైద్యం కోసం ఆస్పత్రికి వెళ్తే ఆరోగ్యశ్రీ వర్తించదని, శస్త్రచికిత్సకు రూ.4 లక్షలకుపైగా ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. కొందరు బంధువులు అప్పు ఇవ్వగా సర్జరీ చేయించే వీలు కాలేదు. వీరి దీనస్థితిని ధర్మపురికి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట రమేశ్ తెలుసుకుని ఏప్రిల్ 5న ఫేస్‌బుక్‌లో పోస్టు చేశాడు. బాధితుడికి సాయం అందించాలని కోరాడు. దీనికి స్పందించిన తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎన్నారైలు, ఇతర దాతలు రూ.1.40 లక్షలు మనోహర్ భార్య సరోజన బ్యాంకు ఖాతాలో జమ చేశారు. ఆ మొత్తాన్ని రమేశ్ స్థానిక ఎస్‌బీఐ శాఖ మేనేజర్ దినేష్ చేతులమీదుగా బాధిత కుటుంబానికి అందించారు. మరికొందరు దాతలు సాయం చేసి మనోహర్‌ను ఆదుకోవాలని ఆయన భార్య సరోజన కోరుతోంది.

ధర్మపురిలో కొప్పుల ఈశ్వర్ ప్రచారం


మార్కెట్‌లో ప్రచారం చేస్తున్న కొప్పుల ఈశ్వర్

ధర్మపురి: పట్టణంలో మంగళవారం బీఆర్‌ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ తన ప్రచారం కొనసాగించారు. స్థానిక కూరగాయల మార్కెట్‌లో, నంది, గాంధీ చౌక్‌లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. శాసనసభ ఎన్నికల్లో అసత్యపు ప్రచారాలు చేసి అధికారం చేపట్టిన కాంగ్రెస్, ఆరు గ్యారంటీలు అమలు చేయక ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, ఏఎంసీ మాజీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, వైస్ చైర్మన్ అక్కెనపెల్లి సునిల్‌కుమార్, మండల, పట్టణశాఖ అధ్యక్షులు మొగిలి శేఖర్, ఆకుల రాజేశ్ పాల్గొన్నారు.

దమ్మన్నపేటలో పిచ్చికుక్క స్వైర విహారం

- ఆరుగురికి తీవ్ర గాయాలు
- 12 పశువులకు కూడా..


లింగవ్వ


గంగవ్వ


నారాయణ


అయిలయ్య

ధర్మపురి: ఇళ్ల ముందు నిద్రిస్తున్న వారిపై ఓ పిచ్చికుక్క విరుచుకుపడి ఆరుగురిని తీవ్రంగా గాయపర్చింది. 12 పశువులను కరిచింది. ఈ సంఘటన మండలంలోని దమ్మన్నపేటలో మంగళవారం చోటుచేసుకుంది. గాయపడిన వారిలో ఉల్లెందుల లింగవ్వ, మంతుర్తి ఐలయ్య, బండారి నారాయణ, జక్కుల రాజవ్వ, గాడిచందుల గంగవ్వ ఉన్నారు. వీరిని బంధువులు 108లో జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. పిచ్చికుక్క కోసం గ్రామస్తులు ఊరంతా గాలించినా దొరకలేదు.

గల్ఫ్ కార్మికుడి కూతురు టాపర్


తల్లి లత, అక్క హారిణితో అశ్విత

కోరుట్ల రూరల్: మండలంలోని అయిలాపూర్‌కు చెందిన అశ్విత కల్లూర్ మోడల్ స్కూల్లో పదోతరగతి చదివింది. 10 జీపీఏ సాధించి, ప్రభుత్వ పాఠశాలల మండల టాపర్‌గా నిలిచింది. ఆమె తండ్రి జగదీశ్ గల్ఫ్ కార్మికుడు కాగా, తల్లి లత బీడీ కార్మికురాలు. ఈ దంపతులకు ఇద్దరు కూతుళ్లు. పెద్దమ్మాయి హారిణి కోరుట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. కూతుళ్లిద్దరూ చదువులో రాణిస్తుండటంతో జగదీశ్–లత హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల కేజీబీవీకి చెందిన మనీషా 10 జీపీఏ సాధించినట్లు ఎంఈవో శ్రీనివాస్ తెలిపారు. మండలంలో మొత్తం 375 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలు రాయగా 348 మంది ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు.

తండ్రి చనిపోయిన బాధలో పరీక్షలు రాసి..

- 7, 6.2 జీపీఏ సాధించిన కవలలు


రామ్, లక్ష్మణ్

పెగడపల్లి(ధర్మపురి): మండలంలోని బతికపల్లికి చెందిన గాజె చంద్రయ్య–లక్ష్మి దంపతులకు మొదటి సంతానంలో కూతురు, రెండో సంతానంగా కవలలు రామ్, లక్ష్మణ్ జన్మించారు. వీరు స్థానిక ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి చదివారు. తండ్రి చంద్రయ్య పరీక్షల రెండో రోజున అనారోగ్యం కారణంగా ఆత్మహత్య చేసుకున్నాడు. అదేరోజు కుమారులు హిందీ పరీక్ష రాయాల్సి ఉంది. చదువులకు ఆటంకం కలగొద్దని బంధువులు, కుటుంబసభ్యులు నచ్చజెప్పి, పంపించారు. పుట్టెడు దుఃఖంలోనూ పరీక్షలు రాసిన రామ్ 7 జీపీఏ, లక్ష్మణ్ 6.2 జీపీఏ సాధించారు. వారిని గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.

‘పది’లో ప్రైవేటు పాఠశాలల ప్రభంజనం


జ్యోతి, మానస, సూర్య పాఠశాలల్లో 10 జీపీఏ సాధించిన విద్యార్థులు



చైతన్య పాఠశాలలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులు

జగిత్యాల: విద్యాశాఖ మంగళవారం ప్రకటించిన పదో తరగతి ఫలితాల్లో జిల్లా విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబర్చారు. జిల్లాకేంద్రంలోని జ్యోతి, మానస, సూర్య స్కూల్స్‌కు చెందిన 25 మంది 10 జీపీఏ సాధించి జిల్లాలో నంబర్‌వన్‌గా నిలిచారు. అలాగే 9.8 జీపీఏ 44 మంది సాధించారు. అందరూ 9 జీపీఏ సాధించి జిల్లాకే గర్వకారణంగా నిలిచారు. శ్రీ చైతన్య స్కూల్‌లో ఐదుగురు విద్యార్థులు 10 జీపీఏ సాధించారు. 9.8 జీపీఏ 11 మంది విద్యార్థులు సాధించారు. అల్ఫోర్స్ విద్యార్థులు సోనియా 10జీపీఏ, విష్ణుమిత్ర 10, కనిష్కరెడ్డి 10, అద్వైత్ 10 జీపీఏ సాధించినట్లు ఆయా విద్యాసంస్థల అధినేతలు తెలిపారు.

దూషించాడని కొట్టి చంపారు

- యువకుడి హత్య కేసులో ఇద్దరి అరెస్టు
- వివరాలు వెల్లడించిన సీఐ నీలం రవి

మల్యాల(చొప్పదండి): మల్యాల మండలం రాజారం గ్రామంలో ఈనెల 22న హత్యకు గురైన రామన్నపేట గ్రామానికి చెందిన ముస్కు మహిపాల్‌రెడ్డి కేసును పోలీసులు ఛేదించారు. మద్యం తాగి దూషించాడనే కారణంతోనే మహిపాల్‌రెడ్డిని హత్య చేశారని పోలీసులు వెల్లడించారు. కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. సంఘటనకు సంబంధించిన వివరాలను సీఐ నీలం రవి మండలకేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వెల్లడించారు. రామన్నపేటకు చెందిన ముస్కు మహిపాల్‌రెడ్డి ఈనెల 22న రాజారం శివారులో హత్యకు గురైన విషయం తెల్సిందే. మృతుడి భార్య జమున ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. మహిపాల్‌రెడ్డి స్నేహితుడు, జగిత్యాలకు చెందిన మహేందర్ ఈనెల 22న జగిత్యాలలోని ఓ బార్‌లో మద్యం తాగేందుకు వెళ్లారు. అదే సమయంలో అక్కడికి మహేందర్ స్నేహితుడు, గొల్లపల్లి మండలం ఇబ్రాజ్‌పల్లికి చెందిన సిద్దిబియా వచ్చాడు. ముగ్గురూ కలిసి మద్యం సేవించారు. ధరూరు శివారులోని వైన్స్‌షాప్ వద్దకు వెళ్లి మరోసారి మద్యం కొనుగోలు చేసి రాజారాం శివారు ఎస్సారెస్పీ కాలువ వద్ద ముగ్గురు కలిసి మద్యం తాగారు. మహిపాల్‌రెడ్డి బియాను దూషించడంతో గొడవ మొదలైంది. ఆగ్రహంతో మహిపాల్‌రెడ్డిని కొట్టి చంపారు. మృతదేహం ఆనవాళ్లు కనిపించకుండా ఆటోలో ఉన్న చద్దర్, పండ్లపెట్టెను మృతదేహంపై వేసి నిప్పుపెట్టి ఆటోలో పారిపోయారు. మల్యాల పోలీసులు కొండగట్టు స్టేజీ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆటోలో మహేందర్, సిద్దిబియా అనుమానస్పదంగా కనిపించారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా నేరం చేసినట్లు అంగీకరించారు. వారిని అరెస్ట్ చేసి రెండు సెల్‌ఫోన్లు, ఆటో స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు.

గంజాయి చోరీ కేసులో ఐదుగురి అరెస్ట్

జగిత్యాలక్రైం: సారంగాపూర్ పోలీస్‌స్టేషన్‌లో పార్కింగ్ చేసిన అంబులెన్స్ నుంచి 60 కిలోల గంజాయిని చోరీ చేసిన కేసులో ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సారంగాపూర్ పోలీస్‌స్టేషన్‌లో మార్చి 31న పార్కింగ్ చేసిన అంబులెన్స్ నుంచి ఇద్దరు బాలురు, సారంగాపూర్ మండలం ఒడ్డెరకాలనీకి చెందిన అల్లెపు యశ్వంత్, రంగపేటకు చెందిన ధర్మారపు అశోక్, అన్నవేని గంగాధర్ 60 కిలోల గంజాయిని చోరీ చేశారు. దానిని ఒడ్డెరకాలనీకి చెందిన బోదాసు రాకేశ్, ఓ బాలుడు, మాలెపు రణధీర్‌కు విక్రయించారు. ఆలస్యంగా గమనించిన సారంగాపూర్ పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. రూరల్ సీఐ ఆరీఫ్‌అలీఖాన్, సారంగాపూర్ ఇన్‌చార్జి ఎస్సై గౌతమ్‌పవార్, కానిస్టేబుల్ శ్రీను, రవి, నరేశ్, శ్యామ్ మంగళవారం లక్ష్మీదేవిపల్లి శివారులో వాహనాల తనిఖీ చేపడుతుండగా ఆరుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. వీరిలో ఇద్దరు మైనర్లున్నారు. అల్లెపు యశ్వంత్, ధర్మారపు అశోక్, అన్నవేని గంగాధర్, బోదాసు రాకేశ్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. వారి నుంచి రూ.5,54,750 విలువైన 22.1 కిలోల గంజాయి, మొబైల్‌ఫోన్, నాలుగు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇదే కేసులో మరికొంత మంది పరారీలో ఉన్నారని, వారిని త్వరలోనే పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు. సమావేశంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.